

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్, కందుకూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యల నివారణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని బండపాలెం ప్రాంతంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ జి వెంకటరావు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరు గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం, రవాణా చేయడం, చట్ట రీత్యా నేరమన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండి మాదకద్ర వ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బివి సుబ్బయ్య, పి అన్నం రాజు, స్థానిక మహిళా పోలీసులు కె అనూష, డి.పద్మ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు వరికి..'ఉరి'..!

- ప్రభుత్వం మొద్దు నిద్ర
- మాటలు ఫుల్..కొనుగోలు కేంద్రాలు నిల్..
- నెల్లూరు మసూర రూ.14 వేల ధర
- బిపిటి, షుగర్ ఫ్రీకి మంచి గిరాకీ

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రైతాంగంపై సవతితల్లి ప్రేమ చూపుతోంది.. ఈ ఏడాది తొలి పంటలో మంచి దిగుబడి వచ్చింది. రైతులకు ఓ వైపు ఆనందం, మరో వైపు కన్నీళ్లు మిగుల్చుతోంది.. అంతర్జాతీయం, దేశీయంగా బియ్యానికి మంచి డిమాండ్ రావడంతో తెలంగాణ మసూరి, బిపిటిలకు మంచి ధర లభించింది. దీంతో రైతులు ఆనందంగా అముకున్నారు. మరో వైపు నెల్లూరు మసూర బియ్యానికి గిరాకీ లేకపోవడంతో కేవలం రూ.14 వేల నుంచి రూ.14, 500 మాత్రమే ధర పలికింది. ప్రభుత్వం మాటలు చెప్పింది తప్ప గింజ కొనుగోలు చేయ లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు మసూరాతో భారీగా నష్టపోయిన రైతులు మంచి ధర వస్తుందని ఇళ్లల్లోనూ, కల్లాల్లో ధాన్యం నిల్వచేసుకోగ, కొందరు తక్కువ ధరలకు మిల్లర్లు, దళారులకు తెగనమ్ముకున్నారు

కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

. రైతులకు ప్రతేడాది మద్దతు ధర లభించక నానా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కొందరి రైతులకు గుడ్డిలో మెల్లలా గతం కంటే కొంత మెరుగైన ధర లభించింది. మరి కొందరికి మద్దతు ధర లభించక ఇబ్బందులు పడ్డారు. అంతర్జాతీయంగా వచ్చిన కరోనా, యుద్ధం, ఇతర అవసరాల రీత్యా ధాన్యం ఎగుమతులు పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ంలో ఈ సారి మంచి ధర లభించింది. జిల్లాలో తొలి పంటగా సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో సుమారు 20 లక్షల పుట్లు దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా తెలంగాణ మసూరి (షుగర్ ఫ్రీ) బిపిటి, ఎక్కువ సాగు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర పుట్టి రూ. 17,600 వరకు ధర ఉంది.మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల వరకు పుట్టి రూ.20 వేల వరకు పలికింది. మంచి ధర రావడంతో రైతులు ఆనందంగా అమ్ముకున్నారు. మళ్లీ ఇప్పుడు ఈ ధాన్యం ధర రూ. 18 వేలకు పడిపోయింది. ఎక్కువ మంది రైతులు మంచి ధరలకే అమ్ము కున్నారు. నెల్లూరు జిల్లాలో తక్కువ రోజుల్లో చేతికొచ్చే నెల్లూరు మసూరను సాగుచేశారు. ప్రధానంగా రెండు లక్షల ఎకరాల్లో నెల్లూరు మసూర సాగుచేసినట్లు తెలుస్తోంది. సుమారు ఐదు లక్షల పుట్లు చేతికొచ్చాయి. మద్దతు ధర రూ.17,600 ఉండగా ఈ ధాన్యాన్ని కేవలం రూ.14 వేల నుంచి రూ.14,500 లకే కొనుగోలు చేస్తున్నారు. అందుకే అనేక కారణాలు చూపుతున్నారు. మధ్యలో కొందరు రూ.13 వేలకే కొనుగోలు చేశారు. వాస్తవంగా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే రైతులకు మద్దతు ధర లభించేంది. 20 లక్షల పుట్లలో కనీసం 1.50 లక్షల పుట్లు కోనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మాటలకే పరిమితమైంది.రైతులు స్వయంగా వచ్చిన కేంద్రాలు కావాలని అధికారులను వేడుకున్నా కనికరించలేదు. దీంతో మిల్లర్లు, దళారులు, ఇచ్చిన ధరలకే నెల్లూరు మసూర ధాన్యాన్ని రైతులు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. కొందరు దళారులకు అమ్ముకోగ కొందరు మంచి ధర వస్తుందని ఆశతో ఇళ్లల్లోనూ, కల్లాల ల్లోనూ నిల్వ చేసుకున్నారు. ఎకరానికి రూ.30 వేలు ఖర్చు పెడుతుండగా, ఖర్చులు నెల్లూరు మసూరకు నగదు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంగం మండలానికి చెందిన మధుసూధన్‌రెడ్డి 70 పుట్ల ధాన్యాన్ని కల్లాల్లో ఉంచుకొని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభు త్వం మాత్రం ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లబుచ్చుతోంది..నెల్లూరు మ సూర సాగుచేసిన రైతులకు ప్రభుత్వం ఉరి వేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యానికి మంచి ధర లభించినా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు ధర రాలేదని వాపోతున్నారు.

మాటలు ఫుల్..కేంద్రాలు నిల్..!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతేడాది రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేది. అయినప్పటికీ రైతులకు మద్దతు ధర వచ్చేది కాదు. ఈ ఏడాది కేంద్రాలు పెడతామని చెప్పినా ఎక్కడా మచ్చుకు కనిపించలేదు. 20 లక్షల పుట్లు దిగుబడి వస్తే, ప్రభుత్వం 1.50 లక్షల టన్నులు కొనుగోలు చేస్తామని ప్రకించింది. తెలంగాణ మసూర, బిపిటిలకు మంచి ధర వచ్చినప్పటికీ స్థానికంగా సాగుచేసిన నెల్లూరు మసూరకు మాత్రం కోలుకోలేని దెబ్బతగిలింది.

ధర లేక 70 పుట్లు నా దగ్గర ఉన్నాయి
దగుమాటి కామాక్షమ్మ, పెరమన, సంగం మండలం.

నెల్లూరు మసూర 20 ఎకరాల్లో సాగుచేశాను. ఎకరానికి సుమారు రూ. 30వేల వరకు ఖర్చు చేశాను. మా గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు పెట్టలేదు. ప్రయివేటు వ్యక్తులు మా వద్దకు వచ్చి రూ.13 నుంచి రూ.14 వేలకు ధాన్యం కొనుగోలు చేశారు. మంచి ధర వస్తుందనే ఆశతో మా పొలాల్లో పెట్టుకున్నాను. అటు అమ్ముకోలేక, ఇటు ప్రభుత్వం కొనుగోలు చేయక నానా ఇబ్బందులు పడుతున్నాం.

కేంద్రం కోసం తిరిగి తిరిగి

అలసిపోయాం
తుళ్లూరు గోపాల్, విడవలూరు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మా మండలంలో ఒక్క కేంద్రం ప్రారంభించలేదు. గ్రామానికి ఒక్కటి కాదు కనీసం మండలానికి ఒక్కటైనా పెట్టాలని కలెక్టర్‌ను అనేక సార్లు కలిశాం. ఇదిగో అదిగో అన్నారు. ఇప్పటికీ పెట్టలేదు. రైతులు నెల్లూరు మసూరును తక్కువ ధరలకు తెగనమ్ముకున్నారు. మా ప్రాంతాల్లో ఇంకా ఉన్నాయి. కొన్ని రకాలకు మంచి ధర వచ్చింది. అంతవరకు సంతోషమైనా, నెల్లూరు మసూరకు వచ్చిన ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు విఫల మయ్యారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్

ఆశావర్కర్‌కు రక్షణ కల్పించాలి

-సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో విధి నిర్వహణలో భాగంగా వరికుంటపాడు మండలం, తూర్పుచెన్నంపల్లి ఆశా వర్కర్ మాతా శిశు సంరక్షణలో భాగంగా పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో తరలించి తిరిగి తన ఇంటికి వెళ్తున్న సమయంలో ఓ కారు డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడటం దారుణమని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు సంరక్షణ కోసం ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదిన ఆశా వర్కర్ ఎన్ ఓబులమ్మ అనే మహిళ మంగాపురం ప్రాంతానికి చెందిన ఓ గర్భిణీ పురిటినొప్పులతో బాధపడుతుండటంతో వైద్యసేవల నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించే సమయంలో 108,104 వాహనాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఓ ప్రయివేట్ వాహనంలో తీసుకెళ్లాల్సి వచ్చిందన్నారు.

ఆశా కార్యకర్త తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కారు డ్రైవరు అసభ్యకరంగా వ్యవహరించారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి కారు డ్రైవర్ హరి నారాయణ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఆశా వర్కర్ అయినా ఓబులమ్మకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ , సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కోశాధికారి కె.పెంచలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరికి ఆదాల వంశీకృష్ణారెడ్డి

- ..ఉత్కంఠ రేపుతున్న రాజకీయం
- ..నేడు హైదరాబాద్‌లో సజ్జలతో కీలక భేటి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి ఎంఎల్ఎ టికెట్‌పై ఉత్కంఠకు తెరపడనుంది. మేకపాటి కుటుంబం చేతిలో నుంచి ఆదాల కుటుంబానికి రాజకీయం మారుతున్నట్లు తెలుస్తుంది. ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని వైసిపి సస్పెండ్ చేయడంతో 2024 ఎన్నికల్లో టికెట్ కోసం అందరి చూపు పడింది. మేకపాటి కుటుంబానికి ఎప్పటి నుంచో వస్తున్న ఆ సీటును నిలబెట్టుకోడానికి మేకపాటి రాజమోహన్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ నుంచి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె ఆదాల రచనారెడ్డి పేరు ఇటీవల తెరపైకి వచ్చింది. దీనిని అక్కడ టికెట్ ఆశిస్తున్న కొందరు నేతలు వ్యతిరేకించారు. వైసిపి పార్టీకి తొలి నుంచి వెన్నుదన్నుగా ఉన్న మేకపాటి కుటుంబానికి జగన్ వద్ద ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో ప్రత్యేకంగా కలిశారు. మాటల సందర్భంలో ఉదయగిరి నుంచి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి భార్య కుమార్తె, ఆదాల రాఘవరెడ్డి కోడలు ఆదాల రచనారెడ్డి పేరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదాల వంశీకృష్ణారెడ్డి పేరుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. సజ్జల రామకృష్ణారెడ్డితో ఒకసారి చర్చించి, వారిద్దరిలో ఎవరు ఉంటారో చెప్పాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో నేడు హైదరాబాద్‌లో కీలక సమావేశం జరగనున్నట్లు తెలిసింది. సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు మేకపాటి కుటుంబం ప్రత్యేక భేటీకోసం మేకపాటి రాజమోహన్‌రెడ్డి హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి రాజకీయం ఉత్కంఠంగా మారింది. ఇక్కడ టికెట్ కోసం మెట్టుకూరు ధనంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, వంటేరు వేణు గోపాల్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు రచనారెడ్డి, మేకపాటి కుటుంబం ముందుకు రావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ అందరిలో కనిపిస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి.

హక్కుల సాధనకు పోరాటాలు అవసరం

ప్రజాశక్తి-నెల్లూరు: మైనారిటీలు తమ కనీస హక్కులను మర్చిపోతున్నారని హక్కుల గురించి పోరాడుతున్న ఆవాజ్ ముందు ఉండడం శుభపరిణామని ప్రొఫెసర్ షేక్ ఖాజా రసూల్ అన్నారు. శుక్రవారం ప్రజాశక్తి బుక్ హౌస్‌లో ఆవాజ్ రంజాన్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలు చదువుకి ఆమడ దూరంలో ఉన్నారని ఉద్యోగాలు కూడా నామమాత్రంగా ఉన్నాయని చదువుల్లో ముందు ఉంటూ మంచి స్థాయిలో రాణిస్తే మైనారిటీలు అందరూ ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు .. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ మైనార్టీల స్థితిగతులను సమస్యలను రంజాన్ ప్రత్యేక సంచికలో తీసుకు వచ్చామన్నారు. ఈ రంజాన్ ప్రత్యేక సంచికకు వ్యాసాలు ప్రకటనలు ఇచ్చి సహకరించిన వారందరికీ ధన్యవా దాలు తెలుపుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, షేక్ రియాజ్, షేక్ చాన్ బాషా, షేక్ ఫయాజ్, షేక్ రియాజ్, షేక్ చాన్ బాషా, సయ్యద్ సర్దార్ అహ్మద్, సయ్యద్ గౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ ఇన్‌ఛార్జ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: నిత్యం ఎంతో మంది పేద వారి ఆకలిని తీరుస్తున్న కందుకూరు వారి శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముండ్లమూరి వారి పాలెం వాస్తవ్యులు మండా మల్లికార్జున, శ్రీలత దంపతుల కుమారుడు భీష్మ పుట్టినరోజు సందర్భంగా కందుకూరు పట్టణం విప్పగుంట రోడ్డులో మార్కెట్ యార్డు గోడ పక్కన నివాసం ఉంటున్న పేదలకు భోజనం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా పుట్టినరోజు సందర్భంగా పార్టీల పేరుతో డబ్బులు వథా చేయకుండా ఇలా పేదవాని కడుపు నింపినప్పుడు, ఎంతో సంతోషాన్ని తప్తిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వలేటి రాఘవుల ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-కందుకూరు: నిరంతరం పేద ప్రజల కోసం పనిచేసిన వలేటి రాఘవులు ఆశించిన లక్ష్యం కోసం పని చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. సిపిఐ నాయకులు రాఘవులు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు అధ్యక్షతన శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ రాఘవులు కందుకూరు నియోజకవర్గంలో అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు నడిపి ఎంతోమంది పేదలకు నివేశన స్థలాలు ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన జీవితాంతం కమ్యూనిస్టు పార్టీ జెండాను మోస్తూ ఆ జెండా లక్ష్యం నెరవేరాలని పరితపించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాల కొండయ్య, వీరారెడ్డి, డి.ఆదినారాయణ, మురళి కష్ణ, ఆనందమోహన్, బాలబ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-లింగసముద్రం: మండలంలోని అన్నెబోయినపల్లి సచివాలయంను శక్రవారం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ శ్యాంబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సచివాలయం సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. వివిధ పనులు కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వారి పనులు చేయాలని చెప్పారు. అదేవిధంగా ఆర్‌బికె సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాగర్ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

సెక్రటరీలు క్రమశిక్షణగా మెలగాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధుల నిర్వహణల్లో క్రమశిక్షణ పాటించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. స్థానిక 28/1 జెడ్పీ కాలనీ, 28/2 న్యూ మిలటరీ కాలనీ 1, 28/3 న్యూ మిలటరీ కాలనీ 2 వార్డు సచివాలయాలను కమిషనర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని నోటీసు బోర్డు, హాజరు రిజిస్టర్, వివిధ రికార్డులను పరిశీలించారు. ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ధరించాలన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

కుర్చీలు, ఫ్యాన్ బహూకరణ

ప్రజాశక్తి-కందుకూరు: శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలుకూరు సర్పంచ్ వీరమల్లు శ్రీను కందుకూరు మున్సిపాలిటీ 29వ వార్డు దూబగుంట అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీలు, ఫ్యాన్ శుక్రవారం బహూకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు సిడిపిఒ షర్మిష్ట ప్రకాశం, సూపర్ వైజర్ అంజమ్మ పాల్గొన్నారు. అంగన్ వాడీ కార్యకర్త నల్లపు మాధవి, ఆయా పల్నాటి రాధ, గ్రామస్తులు పాలడుగు భాస్కర్, మేళం శివాజీ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-ఉలవపాడు: కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి చిన్న పిల్లలకి మహీధర్ రెడ్డి అందిచారు. ఉలవపాడు మండలం రామాయపట్నం సచివాలయం పరిధిలోని రామాయపట్నం గ్రామంలో రెండవ రోజు కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉలవపాడు మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు: ఆర్‌టిసి బస్సును ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈసంఘటన మండలంలోని తెట్టు వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. కావలి నుంచి గుడ్లూరుకి ఆర్‌టిసి బస్సు వస్తుంది. ఎదురుగా వస్తోన్న ఆటో బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పై ఆర్టీసీ సిబ్బంది గుడ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: పురపాలక సంఘ పరిధిలో 18 స్కూల్స్‌లో జరుగుతున్న నాడు- నేడు పనులను పబ్లిక్ ఈఈ ఆలీ, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. స్కూల్స్‌లో జరుగుతున్న పనులను నాణ్యతతో చేయాలని, త్వరగా కంప్లీట్ చేయమని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు: మార్కాపురంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. అన్నదాతల ఆత్మీయ సమావేశంలో కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాజీ సిఎం చంద్రబాబు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కందుకూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆజాదీక అమత మహోత్సవం సందర్భంగా కనిగిరి రోడ్డులోని పొగాకు బోర్డు ఉద్యోగస్తులు, కందుకూరు పొగాకు బోర్డు ఉద్యోగస్తులకి శుక్రవారం ఉదయం 6 గంటలకు బివి రమణ యోగా గురువు యోగ ఆసనములు చేయించారు. కార్యక్రమంలో కే రాజగోపాల్, చైన్ రామ్ మీనా, వేలం కేంద్రం సిబ్బంది సిహెచ్ శ్యామ్ సుందరం, వి.శరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు

యోగా చేస్తున్న దృశ్యం

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మహీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లూరు: కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి 64వ పుట్టినరోజు వేడుకలు గుడ్లూరు బస్టాండ్ సెంటర్లో వైసిపి నాయకులు, అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.బాపిరెడ్డి, ఎంపీపీ పులి రమేష్, మాజీ ఎఎంసి చైర్మన్ చెరుకూరి సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-లింగసముద్రం: మండల కేంద్రమైన లింగసముద్రంలోని వైసిపి కార్యాలయంలో కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలో కేక్‌ను పార్టీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫి, గంగపాలెం,యర్రారెడ్డిపాలెం, మొగిలి చర్ల గ్రామ సర్పంచులు పేలపల్లి మహేష బాబు, డబ్బుగొట్టు మల్లిఖార్జున, కొలికి లక్ష్మినర సింహం, తిమ్మారెడ్డిపాలెం ఎంపిటిసి సభ్యులు దగ్గ వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: జననేత మానుగుంట మహీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తు కందుకూరు పట్టణంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఇందులో భాగంగా శుక్రవారం కోవూరు రోడ్డులోని స్వర్ణ మానసిక వికలాంగుల పాఠశాలలో వైసిపి నాయకులు కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు బిరుదుల సంధ్యారాణి ఆధ్వర్యంలో వికలాంగ పిల్లలకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు. కిషోర్, జనార్ధన స్వామి దేవాలయం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, మాజీ కౌన్సిలర్ గేరామనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పాఠశాలలో అన్నదానం

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఒకటో వార్డు వైసిపి నాయకులు నగళ్ల నారయ్య, కుంభాల క్రాంతి ఆధ్వర్యంలో స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల పాఠ శాలలో అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సవిడి బోయిన శివ, ఎల్లవుల మురళి, దేవరాల శీను, బక్క ముంతల అశోక్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీని గద్దె దింపాలి

నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరులో

నెల్లూరు 11వ డివిజన్‌లో

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను అనుసరిస్తున్న మన దేశ ప్రధాని మోడీని ఇంటికి సాగనంపాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయం తెస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని తన ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారన్నారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ పెట్రోలు, గ్యాస్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కమిటీ నాయకులు ఎగ్గోలు భాస్కర్, అచ్చి అనంతయ్య, ఏటూరు సాంబయ్య, పల్లవరపు దయాకర్, సగిలి అమర్నాథ్, పల్లవరపు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు :కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో ప్రజలకు చేసిన విభజన హామీలు అమలు చేయకుండా ఏపిని అదోగతిపాలు చేస్తుందని సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన, మతోన్మాద బిజేపీ నీ సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం.. అంటూ నగరంలోని 11వ డివిజన్ సిపిఎం ప్రచార బేరి రెండోవ రోజు కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.సూర్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు టి.నారాయణ, శివకుమారి, ఆవుల.పెంచలయ్య, పసుపులేటి. మల్లికార్జున, కర్తం.బాబు, జి.మురళి, కె. సుబ్బారావు, ఐ.శేషయ్య, కత్తి.చిన్న, కె.ఆనంద్, సాయి గణేష్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్.పి. సమావేశ మందిరంలో జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ప్రణాళిక, ఆర్థిక విషయములు, పనుల విషయములు, గ్రామీణ అభివద్ధి, వ్యవసాయ, స్త్రీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ విషయాలు తదితర విషయాలపై స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాల వివరాలను వివరించడంతో పాటు ఆయా కార్యక్రమాల ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని సంబందిత శాఖల అధికారులు, జడ్పీ చైర్ పర్సన్‌కి, ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా వున్న జడ్పిటిసి సభ్యులకు తెలియజేశారు. క్షేత్ర స్థాయిలో వున్న పలు సమస్యలను ఈ సందర్భంగా స్థాయి సంఘాల సభ్యులు జడ్పి చైర్ పర్సన్ దష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై స్పందించిన జడ్పి చైర్మన్ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో తెలిపిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా కషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాల వివరాలను సంబందింత జడ్.పి.టి.సి.లకు, ఇతర ప్రజా ప్రతినిధులకు కచ్చితంగా తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత ప్రణాళికా మరియు ఆర్థిక విషయాలపై జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం పై చేపడుతున్న జల్ జీవన్ మిషన్, ఇతర అభివద్ధి పనులను ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఇ రంగవర ప్రసాద్ వివరించారు. ప్రతి ఇంటికి కొళాయి ఇచ్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో మంజూరైన వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం పనులను టెండర్ల విధానంలో పూర్తిచేయాలని సభ్యులు అధికారులను కోరారు.

'ఫ్యామిలీ డాక్టర్' విధానమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు మండలంలో విస్తృత పర్యటనలో కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కుటుంబ డాక్టర్ విధానం ద్వారా అందరికీ వైద్యం అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆత్మకూరు మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత ఆత్మకూరు మండలం, నల్లపరెడ్డి పల్లి గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో కుటుంబ కుటుంబ ప్రధానంలో గ్రామస్తులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ డాక్టరు విధానాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుకుగానూ గ్రామాలలో కుటుంబ డాక్టర్ విధానంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పుడు గ్రామస్తులకు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారని వైద్యులకు సూచించారు. గ్రామాలలోని ప్రజలు వైద్యంకోసం జిల్లా కేంద్రాలకు వచ్చి ఇబ్బంది పడుతున్నారనే సదుద్దేశంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ డాక్టరు విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. రక్తహీనత కలిగిన చిన్నారులు, మహిళలు, గర్భిణులపై, సుగర్ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసుకునేందుకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆత్మకూరు మండలం, బట్టేపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీచేసి, రిజిస్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఎంత మంది పిల్లలు ఉన్నారు.. వారికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించిన పౌష్టికాహార వివరాలతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య డేటాను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో రక్తహీనత ఉన్న గర్భిణులు, తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, వారు వాడుతున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందించడంతో పాటు ఎనిమియా నివారణకు గర్భిణులకు సరైన విధానంలో పౌష్టిక ఆహారాన్ని, మందులను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, ఐ.సి.డి.ఎస్. పిడి సౌజన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద చేపడుతున్న సైడు కాలువల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆత్మకూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని కంటి పరీక్షల వార్డును, రక్త పరీక్షల విభాగాన్ని, వైద్య సేవ వార్డులను జిల్లా కలెక్టర్ సందర్శించి సంబంధిత రిజిస్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ రమేష్‌నాథ్, ఆసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆసుపత్రి డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి-సంగం : జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు సక్రమంగా అందేలా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పటిష్ఠంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం తెలుగు గంగ ప్రాజెక్టు సిఇ హరినారాయణ రెడ్డి, సోమశిల ఎస్ఇ వెంకటరమణారెడ్డిలతో కలిసి సంగంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని సందర్శించి, బ్యారేజీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సంగం మండలం, కొరిమెర్ల గ్రామాన్ని సందర్శించి రక్తహీనత గల గర్భిణులు, తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, వారు వాడుతున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందించడంతో పాటు ఎనిమియా నివారణకు గర్భిణులకు సరైన విధానంలో పౌష్టికాహారాన్ని, మందులను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు, తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద చేపట్టిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. ఆయనవెంట ఐసిడిఎస్ పిడి సౌజన్య, సిడిపిఒ పద్మ, తహశీల్దార్ లక్ష్మి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఆశా వర్కర్లకు రక్షణ కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రేణుకమ్మ, మధుసూదనమ్మలు డిమాండ్ చేశారు. వరికుంటపాడు మండలం తూర్పు చెన్నంపల్లి ఆశా వర్కర్ ఓబులమ్మపై డ్రైవర్ పాల్పడ్డ అఘాయిత్యాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలంలోని నరుకూరులో సిఐటియు మండల కార్యదర్శి రాజా ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

మరింత మెరుగైన పొదుపు సేవలు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : రాబోయే రోజుల్లో పొదుపు సంఘాలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఎస్ఆర్ఎల్ఎం లోకాస్ ద్వారా వీలు కలుగుతుందని డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు క్రాంతి పథకం కార్యాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న లోక్ యాప్‌పై శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి పిడి సాంబశివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఉదయగిరి ఏరియా కోఆర్డినేటర్లు పి.వెంకటేశ్వర్లు, జి.శేషారెడ్డి, డిఆర్‌డిఎ నుంచి శిక్షకులు పి.చిన్నయ్య, కాంతారావు, మోహన్ రావు, హరి, మస్తానమ్మ, ఏపిఎంలు వెంకమ్మ, బుజ్జమ్మ, వెంకట రమణమ్మ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావుకు సన్మానం

ప్రజాశక్తి-కావలి : తపాలా శాఖలో నిస్వార్థంతో నియమనిబద్ధతతో, అంకిత భావంతో సేవచేసి ఎందరో మన్ననలు పొందుతూ శుక్రవారం డాక్ సేవక్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఎస్.శేషగిరిరావు డాక్‌సేవక్, సిద్ధనకొండూరు ఎస్.ఒ.కు కావలి హెడ్ ఆఫీస్‌లో ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో కావలి హెడ్ పోస్ట్ మాస్టర్, డిపిఎం, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

పౌరసేవలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి : దేశంలో పరిపాలన వ్యవస్థలో పౌర సేవలు వెన్నుముక లాంటివని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.వాలకొండారెడ్డి పేర్కొన్నారు. "జాతీయ పౌర సేవల దినోత్సవం" సందర్భంగా శుక్రవారం పాతూరు మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో భారత పౌర సేవలు (సివిల్ సర్వీసెస్) అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు నాగేశ్వరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-కావలి : ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి స్ఫూర్తితో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ఆశీస్సులతో తాళ్లపాలెం సత్యం, ఎ.అనిల్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 34వ వార్డులో శుక్రవారం ఆపద్బాంధవ సేవాట్రస్ట్ కార్యాలయంలో సేవా కార్యక్రమాలలో మొదటి కార్యక్రమానికి 25 భోజనం పాకెట్స్ ట్రస్ట్ అధ్యక్షులు దామ మధుసూదన్ రావు అందజేశారు. కావలిరూరల్‌లో 25 మంది పేదగిరిజనులకు భోజనం పాకెట్స్ అందజేశారు. 34వ వార్డు ఇన్‌ఛార్జి పుల్ల శ్రీనివాసులురెడ్డి దంపతులు, ట్రస్ట్ చైర్మన్ దామమధుసూదన్ రావు, తాళ్లపాలెం సత్యం, అనిల్ మిత్ర బృందం పాల్గొన్నారు.

ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లు పరిశీలన

- ముస్లిం సోదరులకు ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే సుల్తాన్ షాహిద్ ఈద్గా మైదానాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా చూడాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా పవిత్ర రంజాన్ మాస ప్రార్థనలు ముస్లిం సోదరులు నిర్వహించుకునేలా చేయాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్

ప్రజాశక్తి-బిట్రగుంట : ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్పెషల్ క్యాంప్‌లో భాగంగా కొండ బిట్రగుంట ఎస్‌సి, ఎస్‌టి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సాయిబాబా గుడి పరిసర ప్రాంతాలలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఎ.కిరణ్ కుమార్, వై.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ పిడి వెంకటదాస్ పేర్కొన్నారు. బోగోలు మండలం బిట్ 1, బిట్ 2లోని జగనన్న కాలనీలలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, గృహ నిర్మాణ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పిడి వెంకటదాస్ మాట్లాడారు. మండల గృహ నిర్మాణశాఖ అధికారి వెంకటయ్య, బోగోలు పంచాయితీ కార్యదర్శి జయలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ అజయ్ కుమార్, బిఎఒలు, వాలంటీర్లు, తదితరులున్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ కొత్త బంగారుపాలెం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్గొని గడపగడపకు తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు గోవిందు, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీను, ఎంపిటిసి ఏకే సుందర్ రాజ్, నాయకులు గందూరి శ్రీనివాసులు, ఉప సర్పంచులు పెండ్లి వెంకటేశ్వర్లు, జనార్ధన్ రెడ్డి, రాయి వినోద్ యాదవ్, ఉదయ్ కుమార్, బండ్ల సురేష్ గౌడ్, మద్దిబోయిన శేఖర్, తోటపల్లి సాగర్, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

'డిబిఎస్' యాజమాన్యానికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి : విద్యతో పాటు ఉద్యోగ కల్పనే కూడ కళాశాల బాధ్యతగా భావించి ఇంత పెద్ద సంఖ్యలో కళాశాల ప్రముఖ పేరెన్నికగన్న కంపెనీలను కళాశాలకు ఆహ్వానించి నూటికి నూరు శాతం విద్యార్థులందరికీ ఉద్యోగ కల్పనకు కృషి చేసిన డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ దామిశెట్టి. బాలసురేష్‌బాబు మాట్లాడారు. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి. సుధీర్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు, కళాశాల ఎ.ఒ. జి.రమేష్ బాబు, ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఎస్.నాగ కిషోర్, కళాశాల ఈ.ఈ.ఈ హెచ్.ఒ.డి. సుజల, డాక్టర్ శ్రీలత, జె.వెంకటేష్, ఎన్.వి. కిషోర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని సౌత్ ఆములూరులోని ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ చెరుకూరు సరళ కుమారి మాట్లాడుతూ పిల్లలు చక్కని విద్యాబుద్ధులు నేర్చుకోవడంలో ఉపాధ్యాయుల తోపాటుగా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలన్నారు.

పులికల్లులో గ్రామసభ

ప్రజాశక్తి-పొదలకూరు : మండలంలోని పులికల్లు పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన తొలి గ్రామ సభ శుక్రవారం సర్పంచ్ జివి సుబ్బమ్మ అధ్యక్షతన గ్రామపంచాయతీ ఆవరణలో కార్యక్రమం జరిగింది. ఆ గ్రామ కార్యదర్శి మాధవి 6 అంశాలతో అజెండాను ప్రవేశపెట్టారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బి.అర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పంచాయతీ పాలకవర్గం, తదితరులు పాల్గొన్నారు.

మారంరెడ్డి మృతదేహానికి నివాళులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు మారంరెడ్డి గోపాల్ రెడ్డి (75) శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. ఆయన మృతదేహానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాళులు అర్పించారు.

వైసిపిలోకి ముగ్గురు చేరిక

ప్రజాశక్తి-పొదలకూరు : పులికల్లు, వెంకటాపురం గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు కొరపాటి రంగయ్య నాయుడు, కొమ్మి శ్రీనివాసులు నాయుడు, గుంజి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీని వీడి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. నాయకులు పెంచలరెడ్డి, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

బ్లేడుతో గొంతు కోసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పొదలకూరు : జీవితం పై విరక్తి చెంది బ్లేడుతో గొంతు కోసుకోవడంతో వ్యక్తి మతి చెందిన ఘటన మండలంలోని తాటిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కరిముల్లా సమాచారం మేరకు.. తాటిపర్తి గ్రామానికి చెందిన యాతం భాస్కర్ రెడ్డి (64) పదిహేనేళ్ల క్రితం తన భార్య చనిపోవడంతో అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తన ఇంట్లో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. చికిత్స కోసం నెల్లూరు పెద్దాసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య

దేశంలో మతచిచ్చుతో బిజెపి పాలన

ప్రజాశక్తి-కావలి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ మతచిచ్చుతో పరిపాలన సాగిస్తుందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో శాంతినగర్లో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా పరిపాలిస్తుందని విమర్శించారు. మతాల పేరుతో ప్రజల ఐక్యతను దెబ్బతీస్తూ కేంద్రలోని బిజెపి ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. కలిసిమెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చు రాజేస్తుందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై నిర్బంధకాండ ప్రయోగిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల నిత్యావసర వస్తువులు ప్రయాణ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. మతం పేరుతో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కె.మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలు కార్మికులు, ఉద్యోగులు, రైతుల సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్న వామపక్ష పార్టీలు చేస్తున్న పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.సత్య నారాయణ, వి.బాబురావు, వై.సత్య, డి.వై.ఎఫ్ఐ నాయకులు సాయి, అజయ్ పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు రైల్వే రోడ్డులోని జామియా మసీదులో శుక్రవారం సాయంత్రం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిములు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు అభిరామ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎసిఎస్ఆర్ కాలనీలో 300 మందికి వార్డు కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, వైసిపి నాయకులు కొండా వెంకటేశ్వర్లు విందును అందజేశారు. సర్ధార్, సాధిక్ హుస్సేన్, మస్తాన్‌వలీ తదితరులున్నారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-వరికుంటపాడు

సిఐటియు నాయకురాలు డిమాండ్‌తో ఎట్టకేలకు అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిని ఎస్ఐ తమ సిబ్బందితో అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయగిరి సిఐ గిరిబాబు, ఎస్ఐ విజయ్ శ్రీనివాసులు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తూర్పు చెన్నంపల్లికి చెందిన తిపిరిబోయిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్‌ను ఏప్రిల్ 14న బలాత్కారం చేయబోయాడని, ఈ హఠాత్ పరిణామానికి భయభ్రాంతులకు గురై ఆమె కుటుంబ సభ్యులతో జరిగిన విషయం వాపోయి 17న వరికుంటపాడులో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వరికుంటపాడు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టి ఎట్టకేలకు శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వారు తెలిపారు.

'సాంకేతిక ప్రదర్శన - రైతు సదస్సు'

ప్రజాశక్తి-ఉదయగిరి

వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వ్యవసాయ 'సాంకేతిక ప్రదర్శన- రైతు సదస్సు' కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్ బాబు మూడు నెలలుగా రావెప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌బివిఆర్, జెసిడిఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రావెప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు రైతు సదస్సుని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల పంటల విత్తనాలు, పంటల సాగు, దిగుబడి, అనేక ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డాక్టర్ ఎం.లక్ష్మి నారాయణ రెడ్డి, రావెప్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్ లోకేష్ బాబు, విస్తరణ విభాగ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు, డాక్టర్ కె.కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇఫ్కో సంస్థ ఆఫీసర్ లక్ష్మీనారాయణ నానో యూరియా, నానో డిఎపి గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మి నారాయణ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి మండల వ్యవసాయ అధికారులు నాగమోహన్, సర్పంచ్ పోలయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెస్సార్స్ లక్ష్మి దేవి, కావ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ విష్ణు, రామలక్ష్మి, అగ్రికల్చర్ అడ్వైసారీ బోర్డు చైర్మన్స్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పొదలకూరు : చాముండేశ్వరి అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పాటు తోడేరు గ్రామస్తులపై.. రాష్ట్ర ప్రజలపై.. ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోడేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన చండీయాగంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఆయన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. తమ గ్రామంతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలంతా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ప్రశాంతంగా జీవించాలని.. కోరుకుంటూ గ్రామస్తులు తమ గ్రామంలోని చాముండేశ్వరి ఆలయంలో ఈ యాగాన్ని జరిపారు.

సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తా..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చుక్కల భూముల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిఒ నెంబర్ 163ను విడుదల చేశారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మర్రిపాడు, అనంతసాగరం, మండలాల సంబంధించి రెవెన్యూ సమస్యలపై ఆర్‌డిఒ ఎస్.కరుణకుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మండలాలలో ఇప్పటివరకు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనేక రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారం కోసం మండలాల వారీగా ఆర్‌డిఒలతో జిల్లా జాయింట్ కలెక్టర్ రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మండలాల వారీగా వచ్చిన రెవెన్యూ సంస్థలను మండలస్థాయి అధికారులు ఎంఎల్ఎలకు వివరించారు. అనంతరం ఆర్‌డిఒతో కలిసి సమస్యలతో చర్చించిన ఎంఎల్ఎ ఎన్ని రోజుల్లోగా వాటిని పరిష్కరిస్తారో ప్రజలకు తెలియజేయాలని అడిగారు. రెవెన్యూ కార్యాలయాలకు చిన్నచిన్న సమస్యలపై వచ్చే ప్రజలకు అప్పటికప్పుడే పరిష్కరిస్తే ఇలా సమీక్షలు నిర్వహించి పరిష్కరించాల్సి అవసరం ఉండదని కోర్టు వివాదాలు పంపిణీ తదితర సమస్యలపై ఉన్నత అధికారులకు తెలిపి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, సిండికేట్ ఫార్మర్ సొసటీ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కొండ వెంకటేశ్వర్లు, ఐవి. రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, సయ్యద్ జమీర్ పాల్గొన్నారు.

కుల రాజకీయాలకు కేరాఫ్ 'చంద్రబాబు నాయుడు'

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కుల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమాల గురించి వివరించారు. మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్‌యాదవ్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్‌చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ శ్రీదేవి నాడు-నేడు పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఫేస్-2లో 35 ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి 974 కోట్ల 47 లక్షల రూపాయలు నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవికాలంలో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయాలని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల తీరుతిన్నులపై ఎంఇఒ నాగేశ్వరరావుతో కూలంకుషంగా చర్చించారు. తదుపరి అల్లూరుపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఎం ప్రసాద్, పలువురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-సంగం : సంగం వద్ద కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఈతకు వెళ్లి శ్రీకాంత్ అనే యువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గాంధీ జనసంఘం గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో సరదాగా ఈతకు దిగారు. నలుగురు గట్టుపై ఉండగా మరో నలుగురు లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఈతకు దిగి గల్లంతయ్యారు. గల్లంతైన వారిని మిగిలిన వారు తాడు సహాయంతో ముగ్గురిని రక్షించారు. శ్రీకాంత్ అనే యువకుడు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ముమ్మరగాలింపు అనంతరం గల్లంతైన శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. పంచనామా నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

నిమ్మచెట్లు దగ్ధం

ప్రజాశక్తి-మర్రిపాడు : నెర్ధనంపాడు గ్రామానికి చెందిన ఇండేల ఓబులరెడ్డి, దశరధరామిరెడ్డికి చెందిన పొలంలో కోత దశలో ఉన్న నిమ్మ, టేకు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల మేరకు.. పక్క పొలం రైతు జామాయిల్ కర్ర కొట్టి ఆకులకు నిప్పు పెట్టగా మంటలు రాలేదని ఇంటికి రాగా గాలి వీచడంతో మంటలు చెలరేగి ఎండలకు ఎండిన గడ్డికి నిప్పు అంటుకొని నిమ్మ తోటలోకి మంటలు వ్యాపించాయి. దాదాపు రూ.2లక్షల వరకు నష్టపోయామని రైతులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆర్ అండ్ బి వైద్యం కోసం వెళుతూ ప్రమాదవశాత్తు షేక్ ఖాదర్‌బి రహదారి వెంబడే ఉన్న బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన బిజ్జంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. షేక్ ఖాదర్ బి (35) లేట్ ఖాజావలి, కూతురు షేరిన 18 గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం తీసుకుంటూ గురువారం సాయంత్రం 8 గంటలకు పక్కనే ఉన్న ఆర్ఎంపి డాక్టర్ వైద్యం కోసం వెళుతూ ఈ సంఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలను వెలికి తీసి వివరాలు సేకరించారు.

CHANGE OF NAME

I, **PADARTI SUDHAKARA RAO** (Old Name), S/O **Obisetty**, Resident of H No 20-04-82, KANIGIRI ROAD, KANDUKUR-523105, SPSR Nellore District, A.P. Here by declare that I have changed my name as **PADARTI V SUDHAKARA RAO** (New Name) S/O **OBISETTY**

CHANGE OF SURNAME

I, **VEERABOMMA HARIKA** (Before marriage) wife of **NALLURU GOPI CHANDU,** Resident of D.No.3-9-15, Kanyakaparameswari Temple Street, Kavali Town, SPSR Nellore Dt., is hereby declare that I have changed my surname as

NALLURU HARIKA

(After marriage)

hereafter call all purpose in future.

శ్రీ కందుకూరు సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
I.A.No. 364/2022
O.S.No. 155/2010

వేమూరి శ్రీనివాసులు ... పిటిషనరు / వాది
వర్సెస్
పూమూరి కొండమ్మ
మరియు వగైరాలు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

ఆర్డరు 1 రూలు 10 సిపిసి నోటీసు

టు,
R5. గాధంశెట్టి సుబ్బారావు, తండ్రి **శ్రీహరి,** డోరు నెం.9/27/10 రు, మానస హాల్ స్ట్రీట్, కావలి టౌన్ మరియు మున్సిపాలిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబరు పిటిషనరు మీ మీద పిటీషన్‌లో పరిహారం కోసం పిటిషన్‌ను దాఖలు చేసి యున్నందున సదరు పిటీషన్‌ను సదరు కోర్టు వారు **తే26-04-2023** దిన వాయిదా వేసియున్నారు. కనుక సదరు తేదీన అనగా **తే26-04-2023 ది ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా కాని లేదా అడ్వకేటు ద్వారా కాని సదరు కోర్టు ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలుపుకోవలసియున్నది. అలా కాని యెడల సదరు కోర్టు వారు మీ పరోక్షమున విచారించి సదరు పిటీషను పరిహారములపై నిర్ణయం తీసుకోగలరని ఇందుమూలంగా మీకు తెలియ జేయడమైనది.

వాయిదా: 26-04-2023

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
శ్రీ టి.గోపాలకృష్ణమూర్తి
వాదితరపు న్యాయవాది, కందుకూరు.

కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 664/2022
O.S.No. 396/2022

పెనుబాక సురేష్ రెడ్డి ... ఇటిషనరు
Vs
కండ్లగుంట దుర్గారెడ్డి ... రెస్పాండెంటు

నోటీసు

To,
కండ్లగుంట దుర్గారెడ్డి, తండ్రి **లేట్ వెంకట రెడ్డి,** శాంతి నగర్, 2వ వీధి, కోవూరు పోస్టు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అను వారికి...

వాది పై నెంబర్న నీ తాలూకు స్థిరాస్తి జప్తు కోరి పిటిషన్ పెట్టియున్నందున నీకు నోటీసు నిమిత్తం వాయిదా **తే9-5-2023 దిన** వేసియున్నది. ఆదినం **ఉదయం 10.30 గం॥లకు** నీవు పై కోర్టులో హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల నిన్ను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

ఎం. మల్లికార్జున బాబు
పిటిషనరు తరపు వకీలు, కోవూరు.

కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 396/2022

పెనుబాక సురేష్ రెడ్డి ... వాది
Vs
కండ్లగుంట దుర్గారెడ్డి ... ప్రతివాది

నోటీసు

To,
కండ్లగుంట దుర్గారెడ్డి, తండ్రి **లేట్ వెంకట రెడ్డి,** శాంతి నగర్, 2వ వీధి, కోవూరు పోస్టు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అను వారికి...

వాది పై నెంబర్న బాకీ వసూలు నిమిత్తం నీ మీద దావా దాఖలు చేసియున్నందున నీకు నోటీసు నిమిత్తం వాయిదా **తే9-5-2023 దిన** వేసియున్నది. ఆదినం **ఉదయం 10.30 గం॥లకు** నీవు పై కోర్టులో హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల నీ పరోక్షమందు దావా తీర్మానించబడును.

ఎం. మల్లికార్జున బాబు
వాది తరపు వకీలు, కోవూరు